# పండగ

(ఆంధ్రజ్యోతి, ఆదివారం, 28-7-1996)

**పండగలనేవి, రొటీన్‌గా సాగిపోయే జీవితాలలో మన మనో వికాసం కోసం సంప్రదాయాల పేరిట ఏర్పరచుకున్న సరదాలు. అంతేకాని ప్రాణాల్ని ఫణంగాపెట్టి పండగలు చేసుకోమనలేదు మన పూర్వీకులు.**

"ఏయ్ సుక్కా! ఆగాగు నేనూ వత్తండ" పోడావును తోలుకుంటూ వచ్చి గడ్డిమోపును కడ్తున్న చుక్కను చేరుకుంది మహాలక్షి.

"కానుపుకు పట్నం ఎల్తండవా?"

'.........'

"ఏటే మాటాడవు? రేపో మాపో పురుడొస్తుంటే.... ఏడకెళ్లేది అనుకోలా మరి..." వంగిన చుక్కను భుజం మీద చేయేసి లేపుతూ అంది మహాలక్ష్మి.

"లేదు పిన్నవా? మా అత్తేమో పండగొత్తోంది కదా ఆ కర్సూ ఈ కర్సూ ఏడ్నలే అంటుండి". మట్టి అంటుకున్న చేతుల్ని చీరకొంగుతో తుడుచుకుండా అంది చుక్క.

"అదేవిటి సుక్కా డాక్టరమ్మ పిండం అడ్డంగా వుందని కాదూ సెప్పిందని నువ్వంటివి" ఆశ్చర్యపోయింది మహాలక్ష్మి.

"అవునే పిన్నవా! కాని పండగొకటొచ్చే. ఏం సేత్తాం?" అది తనకు సంబంధించిన విషయం కాదన్నట్టు అనేసి మరలా ఒంగి తొలగిపోయిన గడ్డిని మోపుగా చేసింది చుక్క.

"నిజమే అనుకో, కానీ ధర్మాసపత్రికదే... అవునులే ఎంత పెబుత్వాసుపత్రి అయినా ఆళ్లకని ఈళ్లకనీ సాలేనా అవుద్దిలే' తన ప్రశ్నకు తనే జవాబు చెప్పుకుంటున్న మహాలక్ష్మి

తన జవాబు తాలూకు సత్యం న్యాయసమ్మతమైనదనే నమ్మింది. మన దేశ జనంలో నిరక్షరాశ్యత ఎంత వుందో అన్యాయానికి తల వంచుకునే మనస్తత్వమూ అంతే వుంది.

చుక్క ఏమీ మాట్లాడలేదు. ఏది ఎలా జరగాలో అది అలా జరుగుతుంది అనే ఖర్మసిద్ధాంతాన్ని దోసిట్లో తాగి జీర్ణించుకుంటున్న కోట్లాది భారతీయులలో ఆమె కూడా ఒకటి.

"అవునుగానీ సుక్కా! మరోమాటు డాక్టరమ్మ కాడకెల్లిపోయి అడక్కపోయావటే. బిడ్డపాటు కొచ్చిందో ఏమో!... అరెరె... వుండుండు మోపు నేనెత్తుతానుండూ, ఒట్టిమనిషివి కాదు" ఈ డబ్బులేని మనుషుల గుండెల్లో డబ్బుకంటే విలువైన మానవత్వం, కట్టుబాట్లు ఉంటాయి.

"ధా పిన్నవా అట్టా నడుత్తూ మాటాడుకుందాం. పొద్దోతే అత్త తిడ్తాది" నెత్తిమీద మోపు సర్దుకుని అడుగులు భారంగా వేస్తూ అడిగింది చుక్క.

"పిన్నవా! లోపల పిండం అడ్డంగా వుంటే కానుపు కష్టమవుద్దా?" నడుస్తున్నదల్లా ఆగింది మహాలక్ష్మి. చుక్కతో రక్తసంబంధం లేని మహాలక్ష్మి "ఏవిటో నాకు తెలవదు"

"నాకేమిటో భయంగా ఉందే పిన్నవా" చుక్క కళ్లలో వేడితడి.

"భయం ఏవిటికే, నారు పోసినోడు నీరు పోయడా?" మరలా అదే ఖర్మ సిద్ధాంతం. మనల్ని అధఃపాతాళానికి తోసేస్తున్న ఖర్మసిద్ధాంతం.

"నీ నోరు సల్లగా ఈ గండం గట్టెక్కితే నీ నోట్లో సక్కరెస్తానే"

"అట్టాగేలే పండంటి మగ బిడ్డను కని నా నోరు తీపి చేద్దూగానీ" తిరిగి నడుస్తూ ధైర్యం చెప్పింది మహాలక్ష్మి.

"చుక్కా! ఇలారా" గెస్ట్‌హౌస్ వాకిట ముందు నిల్చుని పిల్చింది చుక్క పనిచేసే పొలం యజమానురాలు యశోదమ్మ.

"నువ్వెళ్లు పిన్నవా, అమ్మగారు పిలత్తన్నారు. కనబడేసొత్తా"

"దండాలమ్మగోరో"

"ఆ కూర్చో.. ఈ మధ్య కనబడడంలేదేమి.? నెలలు నిండినట్లున్నాయి. ఇంకా పురుడికి పుట్టింటికెళ్లలేదూ నువ్వు?" కుర్చీ లాక్కుని కూర్చుంటూ పరామర్శించింది యశోదమ్మ.

"లేదమ్మగోరో- ఆళ్ళకీ పండగ కర్సులు. రెండో పురిటికి కూడా ఆళ్లమీదే పడ్తే, పండగకర్సులేసూసుకుంటారా? నా కానుపుకే ఎడ్తారా? ఈ మాటె అని మొన్నొచ్చినపుడు మా అమ్మ కళ్లనీళ్లెట్టుకున్నాది పాపం" పుట్టింటోళ్లమీద పెళ్లయిన ఈ నాలుగేళ్లలో తొలిసారిగా జాలిపడింది చుక్క.

"అవునులే పాపం. ఈ రోజుల్లో రెండు కాన్పులతో సరిపెట్టుకుంటుంటిరి. రెండో కానుపు మీ అత్తగారే చెయ్యాలి. అన్నట్టు చుక్కా! మీ వదినకు కాన్పయిందంటే?"

చుక్క నిట్టూర్చింది.

"ఆ అవడం, సక్కటి మొగబిడ్డ, పుట్టడం, పోవడం కూడా అయిపోయిందమ్మగోరూ" యశోదమ్మ ఉలిక్కిపడింది.

"బిడ్డ చచ్చిపోయిందా? డాక్టర్ ఏవన్నారు? ఎందుకు చచ్చిపోయిందంటా?"

'ఆ.... డాక్టరుకాడికి ఏడపోయామమ్మా?. మీరే కానుపు చేసుకోవాలని మా యమ్మ, అత్తగారు రెండో కానుపు సేయాలని ఆళ్ళమ్మ పడుకొని ఇదో ఇట్టా అయింది. ఈ పద్దెనిమిదేళ్ల పడుచుపిల్లలో ఏమి ఆరిందాతనం!' మనసు లోనే నవ్వుకుంది

యశోదమ్మ. ఎవరికి వాళ్లే సంప్రదాయాల్ని తమకనుగుణంగా మార్చుకుంటున్నారు. మూల కారణం పెరిగిపోతున్న స్వార్థం. ఎదిగే ధరలను అందుకోలేని ఆర్థిక దౌర్బల్యం.

"మీ వదినకు కాన్పుగాని కష్టమయిందా? బిడ్డెందుకు పోయిందీ?" ఫ్లాస్క్‌లో కాఫీ గ్లాసులో ఒంచి చుక్కకిచ్చింది యశోదమ్మ. అమ్మగారిచ్చిన గ్లాసందుకుని ప్రక్కన పెట్టి అంది చుక్క.

"కాను సేమో కళ్లు మూసి కళ్లు తెరిసేలోపల అయిపోయింది. బిడ్డేమో సచ్చిపుట్టింది. నాలుగునాళ్లగా వొదినకు జొరం తగ్గకపోతే డాకటరమ్మ కాడికి తీసుకళ్తే రోజులెక్కువ గడిసిపోయినందుకట్టా అయిందని సెప్పారు. నిజమే ఆడికాడికి పది నెలలు కూడా నిండిపోయినాయి. ఏటో మాకేటి తెలత్తాది?"

"మీ ఇంటిల్లపాదికీ మగబిడ్డే లేకపోయినే.... చేతులారా చంపుకున్నారు కదే! తొమ్మిది నెలలు నిండాక నొప్పులు రాకపోయినప్పుడయినా డాక్టరమ్మకు చూపించాల్సింది" గొణుక్కున్నట్టుగా అనిబాధపడింది యశోదమ్మ.

"ఏటో లేమ్మా ఆడికీ భూమ్మీద నూకల్లేవంతే" యశోదమ్మకు ఇలాటివి వింటేనే కోపమొస్తుంది. ఈ ఖర్మభూమికి మోక్షమెప్పుడో! నిట్టూర్చిందామె.

"సరేలే. జరిగిపోయింది జరిగిపోయింది. మరి ఇప్పుడు మీ అత్త నిన్ను ఏ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తోంది?" చెట్లమీద నుండి రాలి పడ్డ ఎండుటాకును ఒళ్లో నుండి తీసిపారేస్తూ అడిగిందామె.

"లేదమ్మగోరో మా అత్తనాకు పోలితో పురుడు పోయిస్తానంటోంది"

దిగ్భ్రాంతిలో మునిగిపోయిందామె.

"నిన్న మొన్న జరిగిన విషాదం కూడా వీళ్లల్లో కరుడుకట్టిన అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని కరిగించలేకపోయిందా?"

"చూడు చుక్కా! నువ్వెళ్లి మీ అత్తనిట్టారమ్మను. నే చెప్తాను. ఈ రోజుల్లో కూడా ఆయాతో కాన్పులేవిటి?"

చటుక్కున లేచి నిల్చుంది చుక్క.

'అమ్మో! ఇంకేమయినుందా? మా అత్తనా మీద మండిపడద్ది. మా కాలంలో మేమంతా పోలి తల్లితోకదా పురుళ్లు పోయించుకుంది. అంటద్ది మా అత్త' అని అది తనకే నచ్చునట్టు కిసుక్కున నవ్వింది చుక్క.

"మరి ఆ కాలంలో ఇంట్లో కూర్చుని సినిమాలు చూసామటే. మరి ఇప్పుడు మీ అత్త టి.వి. ఎందుకు కొనుక్కుందట?" అని నవ్వి, "సరేలే నువ్వు చెప్పినట్టు నేను చెప్పనులే. మీ అత్తను రమ్మను, నేను జాబురాసిస్తా గవర్నమెంట్ హాస్పిటల్‌లో నర్సు నాకు తెలుసు" అంటున్న యజమానురాలి వైపు దీనంగా చూసింది చుక్క."

"వద్దులే అమ్మగోరూ, ఆడమాత్రం అంతో ఇంతో ఖర్చు కాకుండుంటదా? మా కాడుండేదంతా అప్పచ్చులు, అరిసెలకే సరిపాయె. గుడ్డల కొట్లో కూడా అప్పెట్టాడు బావ. అదెట్టా తీరదో!"

యశోదమ్మకు ఎక్కిడికక్కడె ఆశ్చర్యంగా వుంటుంది. 'అప్పులు చెయాల్సిన అవసరం ఆమెకు లేకపోయినా? అప్పులు దేనికి చేయాలో దేనికి చేయకూడదోననే ఇంగితం ఆమెకు తెలుసు. ఆమెకు తెలిసి ఏమిలాభం? తెలియాల్సిన వాళ్లకు తెలియక పోయాక. ఓ కొత్త ప్రాణి, తల్లి పేగు చించుకుని ఈ కొత్త భూగోళం మీద రాలే తరుణంలో చేయాల్సిన అప్పు పండగ భేషజాల కోసం చేయడంలో అర్థం వుందా?"

"వత్తానమ్మ గోరో! పసరానికి కొమ్ములకి రంగు తీసుకోవాల్త... మా అత్తకు సెప్తాలెండి మీర్రమ్మొన్నారని..." వెళ్తున్న చుక్కవైపే చూసి నిట్టూర్చింది యశోదమ్మ "ఎప్పుడుమార్తారు వీళ్లు?...."

గగ్గోలుగా వినిపించిన రోదన శబ్దానికి కన్‌సల్ టేషన్ రూమ్ బయటకొచ్చింది డాక్టర్ అరవింద. పదిమంది జనం. వాళ్ల చేతుల మీద వేళ్లాడుతున్న ఓ గర్భిణీ స్త్రీ శరీరం. వాళ్ల కళ్లల్లో కన్నీరు. వాళ్ల ఒంటి మీద పండగ తాలూకు డూప్లికేట్ జరీ బట్టలు.

"ఏమైంది?"

"డాకటరమ్మో, మీ కాళ్ళట్టుకుంటాను. నా బిడ్డను బతికించుతల్లో, దీని అత్తనన్ను నట్టేట్లో ముంచింది తల్లో" కాళ్లకు చుట్టుకున్న ఆమెను లేపి పేషెంటు ముఖం వంక చూసింది డాక్టర్ అరవింద. గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ ఆమె. పెషెంటు కళ్లల్లో జీవకళ లేదు. బోర్డుమీద పడుకోబెట్టి పొట్ట పరీక్ష చేసింది. అడ్డంగా ఉన్న పిండాన్ని భూమ్మీదకు నెట్టే శక్తిలేని గర్భసంచి పగిలిపోయి పిండం తల్లి చిన్న ప్రేగుల మధ్య నిర్జీవంగా వేళ్లాడుతోంది. తల్లిగుండె గుప్త రక్తస్రావానికి తట్టుకోలేక బలహీనంగా, వేగంగా కొట్టుకుంటోంది. ఊపిరి తిత్తులు ఆఖరి శ్వాసకు సిద్ధంగా ఉన్నాయి. సిస్టర్‌ని పేషెంట్‌కు సెలైన్ పెట్టి, రక్తం అరేంజ్ చేయమని చెప్పి దయనీయమైన దశలో, అర్ధాంతరంగా తన జీవయాత్రను ముగించుకోబోతున్న తన పేషెంటు తాలూకు బంధు జనం వైపు తిరిగింది డాక్టర్ అరవింద.

"ఏమ్మో! బిడ్డ అడ్డంగా వుందనీ, ముందుగానే హాస్పిటల్‌లో చేర్పించమని చెప్పానుకదా!" ఓపిచీట్ వైపు చూస్తూ అడిగిందామె. అందిరి తలలు వాలిపోయాయి.

"చేరిపించాలనే అనుకున్నామమ్మో కానీ సేతిలో వుండేదంతా పండక్కే కర్సయింది. అందుకే ఇంత మోపు సేసుకున్నాము" వాళ్ల కంఠంలో కన్నీళ్లు, వాళ్ల అమాయకత్వం తాలూకు కన్నీళ్లు, అజ్ఞానం తాలూకు కన్నీళ్లు.

నిట్టూర్చింది అరవింద.

పండగలనేవి ఒకేలా సాగిపోతున్న మన జీవితాల్లో మన మనోవికాసం కోసం సంప్రదాయం పేరిట ఏర్పరచుకున్న సరదాలు. అంతేగాని ప్రాణాల్ని ఫణంగా పెట్టుకుని మన పూర్వీకులు మనల్ని పండగలు చేసుకోమనలేదే! ఆమెకు ఆపరేషన్ చేసి బ్రతికించాలనే ఆశతో వేగంగా థియేటర్‌లోకెళ్లింది డాక్టర్ అరవింద. కానీ ఆమెకా అవకాశం ఇవ్వకుండానే మరో ఐదు నిముషాల్లో ఆ కుటుంబ సభ్యుల కళ్లల్లో పండగ కాంతిని ఆర్పేస్తూ రక్తకన్నీరుని మిగిలిస్తూ నూరేళ్ల బ్రతకాల్సిన ఇరవై ఏళ్ళ చుక్క పండగ సరదాకు, పండగ సంప్రదాయానికి ఖర్చయిపోయింది.